# తల్లిచాటు పిల్లవాడు

## 1

లోకం ఒక పెద్ద కొలిమి. అనేక డక్కా ముక్కలు తిని రాటుతేలిన వాళ్లు దానివేడికి తట్టుకోవలిసిందే కాని, ప్రసాదరావులాంటి సుకుమారులు ఆగలేరు. అటువంటి వాడు కొన్ని కారణాలవల్ల లోకం వాత పడ్డప్పుడు—

పత్నీసమేతుడయ్యేవరకూ ప్రసాదరావు తల్లిచాటున పెరిగాడు. లోకాన్ని గురించి అతనికి గ్రంథపరిచయం వల్ల కలిగిన జ్ఞానమే కాని ప్రత్యక్షానుభవం సున్నా. సుకుమారి. మనసుకూడా అటువంటిదే. ఎక్కువకాలం తన భావ ప్రపంచంలోనే వుంటూండేవాడు. ఆదర్శాలు గొప్పవి.

ఒక కొమ్మను వదిలి మరోకొమ్మను పట్టుకోవాలనే బెడ్డనీ కోతులకే కాక మనుష్యులకూ డా. వుంటుంది. భార్య తనదయేరోజు సమీపిస్తున్నకొద్దీ అతను తన భావ

ప్రపంచంలోనించి క్రమ క్రమంగా తల్లిని తీసేసి ఆస్థానం భార్యకివ్వటం మొదలుపెట్టాడు. అందులో తప్పేమీ లేదు—తల్లి అసూయాగ్రస్తురాలు కాకుండా ఉంటే. వెంకాయమ్మ గారు సంతోషించింది.

ప్రసాదరావెంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్న రోజు వచ్చేసింది. గృహస్థాశ్రమంలో ప్రవేశించబోయే వాడు తన భార్య ఈ విధంగా మాట్లాడుతుంది, ఈ విధంగా ప్రవర్తిస్తుంది అని నూరురకాలుగా ఊహించుకోనివ్వండి కాక తీరా దగ్గిరికొచ్చేటప్పటికి నూట ఒకటోరకంగా వుంటుంది. ప్రసాదరావు సంగతి పెంపుడు పిల్లికి తిండి పెట్టుతూండగా అది కాస్తా చెయ్యిపీకిన వాడి సామెతయింది. మర్నాడతని మొహాన కత్తివాటు వేస్తే నెత్తురుచుక్క లేదు. అత నది వరకు రక రకాల ప్రణయ కథలు చదివాడు. అనేకమంది స్త్రీలనుగురించి విన్నాడు. ఇదే రకమూ కాదు. నీాదు మిక్కిలి ఆ పిల్లకు సుశీల అని యెందుకు పేరు పెట్టారో అత నికి అర్థం కాలేదు. గండుపిల్లని కాని కొండముచ్చుని కాని నామకరణం చేస్తే యెంతో సార్థకంగా వుండేది.

ప్రసాదరావుకు జరిగిన మరో అపకారమేమిటంటే ఆ కిందటిరోజునకూడా అతను భావప్రపంచంలో భార్యతో అద్భుతంగా సుఖపడుతూ చక్కని కలలు కంటున్నాడు. యిప్పుడా ముచ్చట తీరిపోయింది భావప్రపంచం పటాపంచ లయింది, కలలు వికలమైపోయినై.

రాయటానికీ—చదవటానికీ సుశీల విపరీతమైన వ్యక్తి

అనిపించవచ్చునుకాని ప్రపంచంలో అటువంటి పిల్లలు లెక్క లేనంతమంది వున్నారు. పెడకట్టె, మొండిది, మూర్ఖురాలు, ముక్కోపి, నాజూకు లేనిది, కట్టెవిరిచినట్టు మాట్లాడేది. మర్యాద తెలీనిది. యేదైనా లెజిస్లేచరు పెట్టి అటువంటి పిల్లలకు పెళ్ళికాకుండా యేర్పాటు చేస్తే సంఘం కొంతవరకు తరిస్తుంది.

వెంకాయమ్మగారు కొడుకు దురవస్థ చెప్పినట్టు గ్రహించింది. [తల్లీ పిల్లల మధ్య భాష అవసరంలేదు.] లోపల చింతించి ఊరుకుంది. ఒక్క నెలరోజుల్లో ప్రసాదరావు దేవత్వం నించి దాదాపు రాక్షసత్వాని కొచ్చాడు. ఆవిడ అర్థంచేసుకుని ఊరుకుంది.

వెంకాయమ్మగారికి వంట్లో అస్వస్థతగా వుండి సుశీల వంటచేసుకోవలి సొచ్చింది. ఆ పిల్ల మొహం మట మట లాడుకుంటూ వంట ఇంట్లో చెంబులూ తప్పాలాలు పగల గొడుతుండగా, ప్రసాదరావు గడ్డం చేసుకోటానికి కాసిని నీళ్ళకోసం లోపలికొచ్చాడు చెంబుపట్టుకుని.అతనింకా అయిదడుగుల దూరంలో వుండగానే సుశీల అతనిపని కనుక్కొని పంపించక "అయ్యో! అలా మీదికొస్తారేం!" అంది. అతనికి ఒళ్లు మండి చేతులోఉన్న చెంబుతో పెళ్ళాం నెత్తిన లాగి ఒకటి కొట్టాడు. దాంతో సుశీల కణతలకు పసుపు కొమ్ము అరగదీసి రాచుకుని ఎవరితోనూ చెప్పకుండాగదిలో ముసుగు పెట్టుకొని పడుకుంది[ఎవరన్నా మాడుమీదఒక్కటి పెట్టినప్పుడూ కణతలకు పసుపు గంధం వెయ్యాలని. ఏ వైద్య

గ్రంథరాజంలో నయినా చెప్పబడుందేమో నాకు తెలీదు. సుశీల ఒక నేటివు డాక్టరుగారి మేనకోడలు కనక ఆమెకే తెలియాలి] ఒక పొయ్యిమీద అన్నం మాడిపోయింది. రెండో పొయ్యిమీది గిన్నె ఒరిగి పడిపోయింది. అప్పుడు వెంకాయమ్మగారు మడికట్టుకుంటే పదింటికి కావలసినవంట పన్నెండింటికి తేలింది.

అనాహ్లాదకరమైన ఈ విషయంమీద ఇంతకన్న ఎక్కువ రాయటం తగని పని. నాలుగు నెలలు కాపరం. సుశీల ఇది గిట్టుపాటు కాని వ్యవహారం అని గ్రహించిందో ఏమో ఎవరితోనూ చెప్పకుండా పుట్టింటికి లేచిపోయింది.

## 2

సుశీల క్షేమం కోరి ఆమెను పుట్టింటినించి తిరిగి అత్తవారింటికి తీసుకొచ్చి రాయబారం చేసే పెద్దలు లేకపోయినారు. కాని మనోవర్తికోసం నోటీసు లిప్పించటానికి కావలసినంతమంది దొరికారు. ఈ విషయమై తగిన ఏర్పాటు చెయ్యటానికి ప్రసాదరావు ఏలూరు వెళ్ళాడు. అత నే విధమైన పేచీలు పెట్టదలచలేదు. వెళ్ళినపని వెంటనే అయిపోయింది. తిరిగి రాత్రిబండి కిరాకా చాలా వ్యవధి వుంది. అతను స్టేషనులోనే భోజనం చేసి తాంబూలం వేసుకుని షచారు చెయ్యటానికి ప్లాటుఫారంమీది కొచ్చాడు. అక్కడెవరూ లేరు. దూరంగా ఒక స్త్రీ కూర్చుని ఉంది. ప్రసాద

రావు ఒక్కసారి ముక్కులోనించి చాలాగాలి వదిలాడు. కొంతకాలంనించీ తెల్లబట్ట కట్టుకుని ఆడది కనిపిస్తే అసహ్యం జాస్తయింది. అతను మెల్లిగా ప్లాటుఫారం రెండో చివరకు పోయి అక్కడే తారట్లాడటం మొదలుపెట్టాడు. ఆలోచన ఎటో పోయింది భావప్రపంచంలో పడి బాహ్య ప్రపంచాన్ని మరిచాడు.

"ఏమండోయ్!"

ప్రసాదరావు కొట్టినట్టు ఉలికిపడి తల ఎత్తిచూశాడు. పలకరించిన గొంతు కటువుగా వుండకపోవటమే కాకుండా చాలా శ్రావ్యంగా కూడా వుండటంవల్ల అతనికి వులికిపడ వలసిన అగత్యం లేదు. కాని ప్రస్తుతం అతనికీ ఆడగొంతుల మాటరంసు బాగాలేదు. ఆ మాటకొస్తే సుశీలది కొంత వరకు శ్రావ్యమైన గొంతే.

అతను తన్ను పలకరించిన మనిషివంక చూసి ప్లాటు ఫారం మరో చివరకు చూపు పరిచాడు. అక్కడ మనిషి లేదు. ఆ మనిషే ఈ మనిషి. మనిషికూడా ఎక్కడ! పిల్ల. పదహారేళ్లు దాటని పిల్ల. జోగంది! రూలుప్రకారం అతను మళ్లీ ముక్కులతో బుసకొట్టాడు. తరవాత ఆ పిల్లవంక తీవ్రంగా చూశాడు మెస్మరైజు చేస్తున్నవాడల్లే. కాని అతని వెనక దీపం ఉండటం చేత ఆ పిల్ల కదంతా సరిగా కనిపించి వుండదు.

"నాకు బెజవాడ కొక్క టికట్టు కొనిపెడతారూ?" అన్నదా పిల్ల. ఆ పిల్లమాటతి ఎంత అందంగా వుంది!

"అలాగే, డబ్బులుతే!"

ముక్కు, ఏం ముక్కు.

"నా దగ్గిర లేవు" అందాపిల్ల.

"నన్ను పెట్టుకోమంటావా?" కళ్ళు!

ఆ పిల్లకు కొద్దిగా కోపం వచ్చినట్టు కనపడ్డది.

"ఉచితంగా ఇవ్వక్కర్లేదు. బదులివ్వండి"

"అవును, తరవాత మనం మనం లెక్కచూసుకునే టప్పుడు–"

ఆ పిల్ల కీసారి బాగా కోపం వచ్చింది.

"అందాకా ఈ ఉంగరం అట్టేపెట్టుకోండి" అని పిల్ల వేలి ఉంగరం తీసిచ్చింది.

గడ్డం, కనిబొమ్మలు, వేళ్లు అనుకుంటూనే అతను నిర్మొహమాటంగా చెయ్యిచాచి ఉంగరం తీసుకున్నాడు.

"ఈ ఉంగరం ఖరీదెంత వుంటుంది?" అన్నాడతను వుంగరం అటూ ఇటూ తిప్పిచూసి.

"డెబ్భై అయిదు"

"శాష్, ఇదేనో ఇమిటేషన్ రాయి"

"మీ రిచ్చే టిక్కెట్టు డబ్బులకు సరిపోతుంది లెండి" అన్నదాపిల్ల.

అతనామాట వినిపించుకోకుండా "ఇదయితే నీ కెలా దొరికింది?" అన్నాడు.

ఆ పిల్ల చర్రుమన్నది. "మీకు మర్యాద తెలీదు. వుంగరం ఇటు తెండి" అన్నది.

ప్రసాదరావు యిచ్చేశాడు. ఆ పిల్ల తీసుకుని వెళ్ళ బోతున్నది.

"వుండు. నీ కిచ్చే రైలుచార్జీకి తాక ట్టవసరంలేదు. టికెట్ కొనిపెడతాను"

అత నీ మాట అంటూండగానే పోర్టరు గంట కొట్టి వెళ్లాడు.

"ఇక్కడే వుండు. టిక్కెట్లు తెస్తాను"

ఆ పిల్ల అక్కడే వుంది.

ప్రసాదరావు ఆమె చేతికి టికెట్ ఇచ్చి మళ్ళీ సంభాషణ మొదలుపెట్టాడు.

"నే నిందాక అన్నమాటలు నీకు రుచించినట్టు కనబడదు. మూడు సంగతులు జ్ఞాపకం పెట్టుకో. నేను ఆంటీ నాచి, ఆంటీ ఫెమినైన్. నీ చర్యంతా ఫిషీగా వుంది."

'అంటే!'

'ఫౌల్'

ఆ పిల్ల చిరునవ్వు నవ్వి 'నా కంతవరకూ అర్థమౌతుంది'

'నీ కింగ్లీషుకూడా వచ్చునా ఏమిటి?'

'నేను స్కూలుఫైనల్ పాసయినాను'

'వెరీగుడ్! నీ సంగతంతా ఫిషీగా వుందని నిరూపిస్తాను చూడు. మీ దేవూరు ? నువ్వు బెజవాడ డబ్బు లేకుండా ఎందుకు పోతున్నావు? నేను బెజవాడ పోతున్నానని నీ కెలా తెలిసింది?'

'నాకు తెలీదు'

'నేను నమ్మను. వొంటరిగా యెందుకు పోతున్నావు!'

'నన్నదంతా అడగకండి! గాయం కెలికినట్టవుతుంది.'

ప్రసాదరావు అకస్మాత్తుగా మాట్లాడటం మానేశాడు.

త్వరలోనే రైలొచ్చింది. దాదాపు పెట్టెలన్నీ ఖాళీగానే ఉన్నై, ప్రసాదరావు చిన్నపెట్టెగా చూచి ఎక్కాడు. బోగం పిల్లకూడా అతని వెనకనే ఎక్కి, "మీ కభ్యంతరం లేకపోతే ఇందులోనే కూర్చుంటాను. చాలామంది మధ్య కూర్చోటానికి నాకు చాల అసహ్యంగా ఉందిప్పుడు. మనస్సు సరిగాలేదు" అన్నది.

"నా కభ్యంతరం లేదు. ఇందులోకూడా చాలామంది ఎక్కవచ్చుననేది మరిచిపోకు."

ఆ పిల్ల నవ్వి "ఎక్కరు" అంది.

ఆ మాట అతనికి దబ్బున అర్థంకాలేదుకాని కాగానే శరీరమంతా ఒక్కసారి ఝల్లుమన్నది. తన బతుకట్టుకంటి పెళ్లాంకూడానా!

అతనా పిల్లవంక తీక్షణంగా చూశాడు. కాని ఆ చూపు వ్యర్థమయింది. ఆ అమ్మాయి రెండోబల్లమీద కంపార్టుమెంటు అవతలివైపు కిటికీదగ్గిర కూర్చుని చూస్తున్నది.

ఆ పిల్ల అన్నట్టే అయింది. ఒకరిద్దరు ఆ పెట్టెలో

ఎక్కాలని ప్రయత్నంచేసి ఇద్దర్నీ చూచి, పక్కకు పోయినారు. రైలు కదిలింది ఆ పిల్ల బయటికి చూడటం మానేసి అతని వంక చాలాసేపు చూసింది. అత నటువైపు చూడలేదు. చివర కామె లేచి అతనికి దగ్గరలో కూర్చుని "మీ అనుమానాలకు సమాధానం చెబుతాను" అన్నది.

అతను పరధ్యానంగా "ఎందుకు? నా కవసరం లేదు" అన్నాడు.

"నన్నుగురించి మీరు దురభిప్రాయం పడుతున్నారు. అది నా కిష్టం లేదు"

ప్రసాదరావు కనిబొమలు ముడేశాడు.

"దురభిప్రాయానికి అవకాశంలేదు. నిలభిప్రాయమేకో స్పష్టంగానే తెలుస్తుంది."

ఒక్కసారి ఆ పిల్ల మొహం బాధపడుతున్న లక్షణాలు కనబరిచింది.

"మీరు నిజంగా క్రూరమైన మనిషి కారనుకుంటాను యెందుకంత హింసించినట్టు మాట్లాడుతారు?"

"క్రూరమైన మనిషి నెందుకా్కను? కావాలంటే నా పిల్లాన్ని అడుగు" అన్నా డతను వికటంగా నవ్వి.

ఆ పిల్ల దీనంగా చూడటం మొదలుపెట్టింది.

"సీ అభిప్రాయాన్ని గురించి నా కెటువంటి అనుమానం లేదు. చూశావు, కుర్రవాడుగా వున్నాడు, అమాయకుడేమో బుట్టలో వేద్దామనుకున్నావు. లేకపోతే స్టేషనులో అంతమంది వుండగా నన్నే ఎందుకు టిక్కెట్ అడిగి

నావు ? బెజవాడకే ఎందుకు కావాలిసొచ్చింది ? నే ఎక్కిన పెట్టిలోనే ఎందుకెక్కావు ? నువ్వు చెప్పిన సమాధాన మేమిటి ఈ పెట్టెల్లో ఇంకా ఎవరైనా ఎక్కుతారంటే?ఇంకే మైనా నామీద ఆశలుంటే ఇప్పటికైనా వదులుకో! నా కర్థంకాని దల్లా ఒకటే! ఇంత చిన్నదానివి నీ కింత ధైర్యం ఎలా వచ్చిందా అని."

ఆ పిల్ల అతననుకున్నట్టు ప్రవర్తించలేదు. మొహానికి చీర అడ్డంపెట్టుకుని ఏడవటం మొదలుపెట్టింది. అంతటితో అతని ధైర్యం యావత్తూ అంతరించింది. పైన ఒక్కపొర ఘనీభవించి చూడటాని కతని మనస్సు పాషాణమల్లే వుంది. కాని అతని మనస్సులోపల జావగా వుంది. ఆ పిల్ల ఏడుపు పైపొరను కొట్టేసింది అతనామెనుసమీపించిమెల్లిగా 'చూడు' అన్నాడు. ప్రయోజనం లేకపోయింది. ఇంకోసారి కొంచం గట్టిగా 'చూడు' అన్నాడు. ఊహుఁ, అతను బలవంతంగా ఆమె మొహం మీదినించి రెండుచేతులూ తీసేశాడు. ఆ కళ్లూ, మూతీ, గడ్డం, ముక్కూ అంత సమీపంలో చూసే టప్పటి కతనికి మతిపోయి ఆ దొండపండరటి మూతిని కాస్తా ముద్దుపెట్టుకున్నాడు.

పెద్దమనిషి చెయ్యవలసిన పనికాదు. ఆ పిల్ల భోగం దయినా, ఆమె అనుమతి లేకుండా, తన్ను నివారించలేని స్థితిలో వుండగా అటువంటి పని చెయ్యటం చాలా నింద్య మైన సంగతి. ఆ వివేచన అంతా మించిపోయిన తరవాత వచ్చింది. ఆ కేకాదు ఇంకా చాలావిషయాలు తెలిసొచ్చినై.

మొదటిసంగతి అత నంత వరకు ఆ పిల్ల విషయంలో ఒక్క- సారైనా పెద్దమనిషి తరహాగా ప్రవర్తించలేదు. మరో సంగతి. ఆ పిల్ల చర్య కింకో కారణం వుండి కూడా వుండ వచ్చును అప్పుడే ఆ పిల్లను బలాత్కారంగా ముద్దుపెట్టు కున్న మొహాంతో ఆలోచిస్తే తన చర్యలో ఆ పిల్ల చర్య నూరోవంతు అవమానాస్పదంగా లేదు.

ఆ పిల్ల లేచి ఎకంగా పోయింది. అతని కామొహంక చూడటానికి ధైర్యం లేకపోయింది. కాని మొండితనం చేసి ఆ మొహంక చూశాడు.

"ఆ గొలుసు లాగితే బండి ఆగుతుంది. లాగు!" అన్నాడు.

ఆమె అతనివంక బోనులో సింహంవంక చూస్తున్నట్టు చూస్తూ నిలబడ్డది.

అతను మొహం చేతుల్లో పెట్టుకుని "నాకు మతి పోడి పోయింది. నేను వెనకటి ప్రసాదరావును కాను!" అని గొణు క్కున్నాడు. అయిదు నిమిషాలసేపు ఇద్దరూ కదల్లేదు. ఆ పిల్ల మెల్లిగా వచ్చి అతని భుజంమీద మెల్లిగా చెయ్యివేసి "మీరేమీ పశ్చాత్తాప పడక్కర్లేదు నా కన్న మీకే మోసం ఎక్కువ ఓూరు చేసిన పనివల్ల. నేను మిమ్మల్ని బుట్టలో వెయ్యటానికి ప్రయత్నం చేస్తున్నాను కనుక నాకు కష్టంగా వుంటుందని మీ రనుకోటాని కవకాశం లేదు" అంది.

ప్రసాదరావు తల ఎత్తి "నే నెలాగా పెద్దమనిషిని కానని నిరూపించుకున్నాను. నువ్వింతవరకు చాలా పెద్ద

మనిషి తరహాగా ప్రవర్తిస్తూ వచ్చావు. ఆ ఒక్క మాటతో నన్ను వదిలెయ్యి" అన్నాడు.

ఆ పిల్ల క్లుప్తంగా "క్షమించండి!" అంది.

ఆ మాటతో అతని కా పిల్లను చూస్తే చాలా గౌరవం కలిగింది. ఇద్దరి పరిచయం ఇంతవరకు వచ్చినతరువాత తన మనస్థితంతా ఆమెకు చెప్పేద్దామనుకున్నాడు. తన భార్య గోలంతా చెప్పాడు. తన మనస్సు విరిగిపోయిందన్నాడు. లేకపోతే తనలా ప్రవర్తించాలిసింది కాదన్నాడు. ఆ పిల్ల అంతా ఓపిగ్గా విని తన కథంతా చెప్పింది.

ఆ పిల్లపేరు కాంతం. ఆమె మేనమామ సంఘసంస్కర్త. అనేక మంది భోగంవాళ్ళకు పెళ్ళిళ్లు చేయించాడు. ఆ పిల్ల నాయనే పెంచి చదువు చెప్పించి పెళ్ళికి ప్రయత్నంచేస్తూ చనిపోయినాడు. తరవాత కాంతం తల్లి దగ్గిరి కొచ్చింది తల్లి కూతుర్ని వృత్తిలో దిగమని ప్రోద్బలం చేసింది. కూతురు వినలేదు. తల్లి దొంగెత్తువేసి పెళ్ళనే వంకపెట్టి ఒక ముద్దు కంటగట్టింది కాంతాన్ని. కాంతం ఆయన్ను పెళ్ళిచేసుకోనంది. భోగంపిల్లలను పెళ్ళి చేసుకునేందుకు మన్మధులు వారని గట్టిగా చెప్పేసింద తల్లి. ఈ పని జరిగిన కొద్దిరోజుల కా వేశ్యమాతకూడా చచ్చిపోయింది. ఆ ముద్దు కాంతం తల్లిదగ్గిర వున్న సామానంతా అమ్మి "మా వూరు ఏలూరు, మా యింటికి పోదాంపద" మని ప్రయాణం చేశాడు ఏలూరులో ఒక సందులో బండి ఆపి ఇక్కడే ఇల్లు దిగమన్నాడు. ఆ ముద్దుకు దిగినబండే అంది వుంటుంది. కాంతం రైలుకు దారి కనుక్కొని స్టేషను చేరేటప్పటికి రైలు

పోయి చాలాసేపయింది. కాంతం భోజనం చేసి పన్నెండు గంటలు దాటింది.

ఇదంతా కాంతం చెబుతానన్నప్పుడతను చెప్ప నియ్యక పోవటం మేలే అయింది. అప్పుడయితే అతని కిది కూడా పార్టు ఆఫ్ ది గేమ్ అనిపించేదే. ఇప్పుడతని గుండె నీరయిపోయింది.

"బెజవాడలో మరి నీ కెవరున్నారు?" అన్నాడు ప్రసాదరావు.

"మా స్నేహితులున్నారు. కొంతకాలం వాళ్ళ అండ పడి వుంటే తరవాత ఏమవుతుందో! మా వారి మన్యుస్నేహితు లున్నారు. వాళ్ళ మొహం ఎలా చూడను?"

"నువ్వెప్పటికైనా కులవృత్తి చెయ్యవలసొస్తుందేమో! నీ కిష్టంలేదు కాదూ?"

"నిజం చెప్పటంకన్న నిజమే ఎక్కువ. ఇష్టంలేక పోతే లేదని అనుకోటంవల్ల ఒరిగేదుందా?"

"లేదు. నువ్వు చాలా అద్భుతమైన దానివి."

"నే ననేదదే! మీరు నిజంగా అలా భావిస్తే చాలు."

మనిషికి బుద్ధిలేదు. అతనికి కాంతాన్ని మళ్లీ ముద్దు పెట్టుకోవాలనిపించింది. ఈ అనిపించటమైనా తప్పయి వుండాలి, అంతకు పూర్వమే కలిగిన అతని పశ్చాత్తాప మయినా అర్థంలేనిదయి ఉండాలి. ఎట్లాగయినా అతనికి బుద్ధిలేనట్టే.

"నన్ను మాట్లాడనివ్వవు! రోజూ నీవంటి దానితో సంచరించటం బహు కష్టం!"

"ఇంత అదృష్టహీనమయిన దాన్నయినానా ?"

ప్రసాదరావు శాంతం రెండు చేతులూ పట్టుకున్నాడు.

"ఎక్కడికీ వెళ్ళవద్దు! నా దగ్గిరే వుండు. శాంతం!"

"ఎవరికోసం ఉండను?"

"నీ కిష్టమయితే నాకోసం."

"మీరు నాతో సుఖపడరు!"

"పడతాను."

"లోకం మిమ్మల్ని చెండుకు తింటుంది."

"నేను లెక్క చెయ్యను."

"చేస్తారు! ఎవరో ఒప్పుకోకపోతే మీరు లెక్క చెయ్యకపోవచ్చు. మీ అమ్మగారే ఉందనుకోండి."

ప్రసాదరావు నిట్టూర్పు విడిచాడు.

ఆవిడ ఒప్పుకుంటే మీ దగ్గిర ఉంటాను. మీ సుఖం కోసంకాదు, నా తిండికోసంకాదు, మీ కోసం ఉంటాను. ఆవిడ ఒప్పుకోకపోతే ఉండను,"

# 3

బెజవాడలో ఇద్దరూ దిగారు. ఒక బండీ ఎక్కారు. ఇద్దరు పోవలసిందీ ఒకవైపే. మధ్య శాంతం బండి ఆపించి దిగింది ప్రసాదరావు ఇల్లు గుర్తుపెట్టుకున్నాడు.

ఇంట్లో అడుగు పెడుతూనే తల్లితో చెప్పుదామని అతని ఉద్దేశం. కాని తల్లి మొహం చూడగానే అతనికి ధైర్యం లేకపోయింది. అతని స్థితి కాలుగాలిన పిల్లల్లే వుంది. ఉత్త శరీరసంబంధమయిన అందం మరుపుకొస్తుంది కాంతాన్ని ఎలా మరిచిపోతాడు ? తను కాంతం విషయంలో చూపించిన అన్యాయం, నిర్దయ, మోటుతనం ! తన అహంకారం ! తనలో ఏం చూసి కాంతం తన్ను బుట్టలో వేసుకోవాలని ప్రయత్నం చేస్తుందిట ? కాంతం అన్న ఒక్కొక్కమాట గంట మోగినట్లు చెవిలో మోగుతుండెను. తనన్న మాటలు తలుచుకుంటే ప్రాణం చచ్చిపోతుండె ! అవి యింకా నాలు గైదుసార్లు జ్ఞాపకం వస్తే మర్నాడు కాంతం మొహంచూసే ధైర్యంకూడా వుండదు తనకు.

సుశీలతో పోల్చినా, ఎక్కడి కాంతం,ఎక్కడి సుశీల! కాంతాన్ని చూస్తే వున్న గౌరవం తన కిం కెవర్నీ చూస్తే లేనప్పుడు ఇంకో ళ్ళేమనుకుంటారో అనే ఆలోచ నెందు కొస్తుంది? కాని తల్లి?—

అతనికి ఒంటి గంటకు కాని నిద్రపట్టలేదు. మర్నాడు లేచే టప్పటి కప్పుడే బాంబు పేలింది. వెంకాయమ్మగారి కప్పుడే రిపోర్టు వచ్చింది ప్రసాదరావు బోగందానితో రైలు దిగాడని వోరూ, బండిలో ఎక్కాడని వోరూ ! వెంకా యమ్మగారు లేవగానే కొడుకును ప్రశ్నించింది. పాలి మొహంతో ఒక్క అబద్ధమయినా ఆడకుండా అతను తల్లికి చెప్పదగినంతవరకు చెప్పాడు.

వెంకాయమ్మగారు నిర్ఘాంతపోయింది.

"కాంతాన్ని ఇంతప్పుడు చూశానురా అబ్బాయి! వాళ్ళ రామదాసు మీ నాన్నకు స్నేహితుడు. జ్ఞాపకం వుందా? ఎర్ర బొట్టు నిలువుగా పెట్టుకుని, తలగుడ్డ చుట్టుకుని, మీసాలూ ఆయనా! మంచివాడు, పాపం! ఆయన పెళ్ళాంతో ఈ పిల్ల ఒకరోజున పేరంటాని కొచ్చింది మనింటికి దాన్ని మళ్లీ ఒకసారి తీసుకురా," అన్న దావిడ నవ్వుతూ.

"ఇవాళే తెస్తాను!" అన్నాడు ప్రసాదరావు నిశ్చింతగా.